క్లుప్తంగా

నేటి నుంచి ఒంగోలు జాతి పశువుల బల ప్రదర్శన

దుర్గి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ 70వ వార్షికోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు కటకం రామారావు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రారంభిస్తారని తెలిపారు. వివిధ విభాగాల్లో మూడు రోజుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కొనసాగుతున్న కుల గణన సర్వే



పిడుగురాళ్ల: పట్టణంలో కుల గణన సర్వే శనివారం కొనసాగింది. 33 వార్డుల్లోని 17 సచివాలయాల పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సర్వే సహకరించి, సరైన సమాచారం అందించాలని ప్రజలను కోరారు. దీంతో కుల గణన సర్వే సమర్థవంతంగా నిర్వహించటం జరుగుతుందన్నారు.

10,11 తేదీల్లో రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలు



చిలకలూరిపేటటౌన్: మూఢ విశ్వాసాలు తొలిగి పోయినప్పుడే దేశం అన్ని రంగాల్లో విజయం సాధిస్తుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం గేయానంద్ చెప్పారు. శనివారం పట్టణంలోని పండరీపురం సిద్దయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాస్త్ర ప్రచారంలో జన విజ్ఞాన వేదిక 36 సంవత్సరాలుగా కృషి చేస్తూ అనేక విజయాలు సాధించిందన్నారు. ఫిబ్రవరి 10,11 తేదీలలతో చిలకలూరిపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్సు సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సైంటిఫిక్ టెంపర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, ఆలిండియా సైన్స్ నెట్‌వర్క్ సభ్యులు శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సోషల్ మీడియా కన్వీనర్ జయప్రకాష్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, ట్రెజరర్ ఎస్ చలపతి రావు, జిల్లా యూత్ అధ్యక్షుడు రమేష్, డివిజన్ అధ్యక్షురాలు సీహెచ్ సృజన తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 'తిరుమల' విద్యార్థుల ఎంపిక



నరసరావుపేట రూరల్: తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన సదర్ ల్యాండ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 47 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో వివిధ బ్రాంచ్‌లకు చెందిన 320 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాతపరీక్ష, బృంద చర్చలు, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించిన అనంతరం విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలు సాధించిన వారిలో సీయస్ఈ–25, ఐటీ–13, ఈసీఈ–7, ఈఈఈ–2 ఉన్నట్లు వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలని బాపట్ల వ్యవసాయ కళాశాల సేవా పథకం ప్రత్యేకాధికారి డాక్టర్ ఉషారాణి అన్నారు. చాగంటివారిపాలెంలో బాపట్ల వ్యవసాయ కళాశాల బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఎన్ఎస్ఎస్ క్యాంపు శనివారం రెండవ రోజు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ, ఆర్బీకేల వద్ద చెత్తను తొలగించి, శుభ్రం చేశారు. పరిశుభ్రతపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామస్తులకు అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రతినిధి డాక్టర్ శర్వాణి పాల్గొన్నారు.

గురజాలలో అభివృద్ధి పరుగులు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పల్నాటి సీమ సస్యశ్యామలం
- సంక్షేమ పథకాలతో మెరుగుపడిన ప్రజల జీవన ప్రమాణాలు
- రూ.3,471 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి
- సంక్షేమం, అభివృద్ధి సమన్వయంలో ఎమ్మెల్యే కాసు సక్సెస్..
- వలస బాట వదిలి..సొంతూరిలో ఉపాధికి పల్లె ప్రజలు



పిడుగురాళ్ల మండలం శ్రీనివాసపురంలో నీటి కొళాయి కనెక్షన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు (ఫైల్)

గురజాల: వెనుకబడిన పల్నాడు ప్రాంతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. కృష్ణానది చెంతనే ఉన్నా తాగేందుకు గుక్కెడు నీరు కూడా లేక గురజాల నియోజకవర్గ ప్రజలు ఒకప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక పక్క సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ప్రజల జీవన విధానాల్లో పెనుమార్పులు తీసుకువచ్చారు. మరొక పక్క వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ.. ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి విశేషంగా కృషి చేశారు. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా పరుగులు పెట్టించారు. కరువు సీమను సస్యశ్యామలంగా మార్చి.. రెండు పంటలు సాగుచేసే పరిస్థితులను తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రజలకు ఎలాంటి సదుపాయాలు కావాలో గుర్తించి, పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేశారు. గురజాల చరిత్రలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా నియోజకవర్గ రూపురేఖలు మార్చేశారు. ఉపాధి కోసం వలస వెళ్లే పల్లె ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చారు.



సంక్షేమం, అభివృద్ధి పరుగులు..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో.. 10,724 తాగు నీటి కొళాయి కనెక్షన్లు ఇవ్వడం జరిగింది. 7,132 మందికి ఇళ్ల స్థలాలు, రైతు భరోసా ద్వారా రైతులకు రూ.14.80 కోట్ల సాయం, రూ.11.98కోట్ల డ్వాక్రా రుణ మాఫీ, అమ్మ ఒడి ద్వారా రూ.28.78 కోట్లు తల్లుల ఖాతాలో జమ, తాగునీటి ఏర్పాటుకు రూ.22.3 కోట్లు, సీసీ రోడ్లు, బ్రిడ్జిలు, డ్రెయిన్లు, భవనాలకు రూ.110.96 కోట్లు, పాఠశాలలకు రూ.9.88 కోట్లు, వైద్యశాలలను రూ.172 కోట్లతో అభివృద్ధి చేశారు.

శాశ్వత పథకాలు ఇవే...

- జంగమహేశ్వరపురం పంచాయతీని కలుపుతూ గురజాలను, దాచేపల్లి, నడికూడి గ్రామ పంచాయతీలను కలుపుతూ దాచేపల్లి నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేయడం జరిగింది.
- పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి సహా 57 గ్రామాల్లో తాగునీటి పథకం కింద రూ.218 కోట్లు కేటాయించారు. 63 జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి 22,000 ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.
- రూ.500 కోట్లతో 600 పడకల వైద్యశాలతో పాటు మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలలను కేటాయించడం జరిగింది.
- దాచేపల్లిలోని కాటేరు వాగు ఆధునీకరణ, మన బడి నాడు–నేడు ద్వారా 190 పాఠశాలలు ఆధునీకరించడం జరిగింది.
- రూ.394 కోట్లతో దాచేపల్లి–గురజాల–మాచర్ల హైవే, రూ.81 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లు, రూ.52 కోట్లతో జానపాడు వద్ద ఆర్వోబీ బ్రిడ్జి నిర్మాణం జరిగింది.
- రూ.11 కోట్లతో పిడుగురాళ్ల, గురజాల చెరువుల అభివృద్ధి, రూ.113 కోట్లతో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, సిమెంటు రోడ్లు వేశారు.
- పిడుగురాళ్లలో.. రూ.82 కోట్లతో బైపాస్ రోడ్డు, రూ.19 కోట్లతో రైల్వే స్టేషన్ అభివృద్ధి, రూ.3 కోట్లతో ఆటోనగర్ ఏర్పాటుచేయడం జరిగింది.
- ఇవికాక.. నవరత్నాల పథకాల ద్వారా 5,12,805 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.1507.81 కోట్లు డీబీటీ ద్వారా జమచేయడం జరిగింది.
- గురజాల నియోజకవర్గంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.3,471 కోట్లతో అభివృద్ధి బాటలు వేశారు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి.



గురజాలలో చురుగ్గా జరుగుతున్న నేషనల్ హైవే పనులు



పూర్తి కానున్న మాచర్ల–గుంటూరు రోడ్డు విస్తరణ

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ పాలన కొనసాగుతోంది. ప్రతి ఇంటికి కృష్ణమ్మ నీటిని అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగింది. కొళాయిల మంచి నీటిని అందిస్తాం. పల్నాడు ప్రాంతానికి మణిహారంగా వైద్య కళాశాల నిర్మాణం జరుగుతోంది. గురజాలను మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి బాటలో నడిపిస్తాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు ప్రాంతం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు.

– కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్యే, గురజాల.



జంగమహేశ్వరపురంలో అర్బన్ హెల్త్ క్లినిక్ సెంటర్



పులిపాడు రైతు భరోసా కేంద్రం



పులిపాడు గ్రామ సచివాలయం

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సహాయం

ఒక్కొక్కరికీ రూ.1లక్ష చెక్కు అందజేసిన అదనపు ఎస్పీలు

నరసరావుపేట: ఇటీవల అనారోగ్యం, రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన ఇరువురు హెడ్‌కానిస్టేబుల్స్ కుటుంబాలకు జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు రూ.1 లక్ష చొప్పున రెండు చెక్కులు అందజేశారు. డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ పోలీస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శేషగిరిరావు గతేడాది అక్టోబరు 21వ తేదీన అనారోగ్యంతో మృతిచెందగా ఆయన సతీమణి మల్లీశ్వరికి, గతేడాది నవంబరు 29వ తేదీన కోటప్పకొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై మృతిచెందిన చిలకలూరిపేట రూరల్ హెడ్ కానిస్టేబుల్ టి.వెంకటేశ్వర్లు సతీమణి తడవర్తి మేనకాదేవికి పోలీస్ అసోసియేషన్ తరపున రూ.1 లక్ష చెక్కు అందజేశారు. పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు పాల్గొన్నారు.



హెడ్‌కానిస్టేబుళ్ల భార్యలకు చెక్కులు అందజేసిన అదనపు ఎస్పీలు

యువకుడు ఆత్మహత్య



రొంపిచర్ల: లోన్ యాప్ ద్వారా అప్పు పొంది తీర్చలేక ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పరగటిచర్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లో కెళితే.. పరగటిచర్ల గ్రామానికి చెందిన గుడిపూడి విగ్నేష్ (22) గుంటూరులోని ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. ఫోన్‌లో యాప్ ద్వారా రూ.10 వేల రూపాయలు అప్పు తీసుకున్నాడు. వాటిని తీర్చమని లోన్ యాప్ వారు ఒత్తిడి చేయటంతో పాటు కుటుంబ సభ్యులకు కూడా ఫోన్‌లు చేశారు. ఆ మొత్తాన్ని కుటుంబ సభ్యులు చెల్లించారు. అయితే ఇంకా అప్పు ఉన్నదేమో వారి వేధింపులు తాళలేక శనివారం ఉదయం ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుని తండ్రి శ్యాం ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పి.రవీంద్ర తెలిపారు. విగ్నేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఇద్దరి ప్రాణాలు కాపాడి..తన ప్రాణం విడిచి

నకరికల్లు: కాలువలో కొట్టుకుపోతున్న ఇద్దరిని కాపాడిన ఓ వ్యక్తి తన ప్రాణం వదిలాడు. ఈ దుర్ఘటన మండలంలోని దేచవరం గ్రామ సమీపంలో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. దేచవరం గ్రామానికి చెందిన కుంటిగొర్ల వెంకటేశ్వరరావు(32) శుక్రవారం తన పొలానికి పురుగు మందు పిచికారీ చేసేందుకు సుబ్బారెడ్డి అనే వ్యక్తితో కలసి వెళ్లాడు. పొలానికి సమీపంలో చిలకలూరిపేట మేజర్ కాలువ 2వ ప్లాంటు వద్ద అదే గ్రామానికి చెందిన జి.శివ, జి.సాయిరెడ్డి అనే ఇద్దరు యువకులు ఈత కొడుతున్నారు. కొద్దిసేపటికే యువకులిద్దరూ కాపాడమని కేకలు వేశారు. పొలంలో పనిచేసుకుంటున్న కె.వెంకటేశ్వరరావు, సుబ్బారెడ్డి వారి అరుపులు విని, కాలువలోకి దూకి ఆ ఇద్దరు యువకులను కాపాడారు. ఈ క్రమంలో డ్రాపు వద్ద అదుపుతప్పిన వెంకటేశ్వరరావు గల్లంతయ్యి.. ఊపిరాడక మృతి చెందాడు. మృతుడికి ఐదేళ్ల క్రితం వివాహం కాగా సంతానం లేదు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బి.ప్రసాద్ తెలిపారు.



మృతుడు కుంటిగొర్ల వెంకటేశ్వరరావు

రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దు రాళ్ల ఏర్పాటు



పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): జగనన్న భూ హక్కు–భూ రక్ష పథకంలో భాగంగా శనివారం మెగా స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం ప్రారంభించారు. మొదటి విడతగా రీ–సర్వే పూర్తయిన పలుదేవర్లపాడు, దేచవరప్పాడు రెవెన్యూ గ్రామాల్లోని భూముల్లో సర్వే హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. మొదటి విడతగా ఎంపికైన గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని, మరో గ్రామంలో సర్వే తుది దశకు చేరుకుందని తహసీల్దారు భవానీ శంకర్ తెలిపారు. రెవెన్యూ, సర్వే సిబ్బంది రైతులతో కలిసి హద్దు రాళ్లు వేయించారు. ఈ కార్యక్రమాన్ని డివిజన్ సర్వేయర్ విజయ్‌కుమార్ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండల సర్వేయర్ శ్రీకాంత్, వీఆర్వో సుభాషిణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరంపాడు దేవస్థానంలో షాపుల నిర్వహణకు వేలం పాటలు

రాజుపాలెం: దేవరంపాడు కొండపై వెంకటేశ్వర స్వామి తిరుణాళ్ల సందర్భంగా దుకాణాల ఏర్పాటుకు శనివారం వేలంపాటలు నిర్వహించారు. 70 మంది డిపాజిట్లు చెల్లించి, పాల్గొన్నారు. తలనీలాల పోగు చేసుకునే హక్కురూ.2.66లక్షలు, కొబ్బరికాయలు, పూజద్రవ్యాల విక్రయం రూ.3.52లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణ రూ.1.66లక్షలు, కేజీ నెయ్యి రూ.380కు, బియ్యం కిలో రూ.47కు, కిలో బెల్లం రూ.45కు, పాదరక్షలు భద్రపరుచుకునే హక్కు రూ.3,7500కు, ఉప్పు, పప్పు వగైరాల సేకరణ రూ.7,200కు పాటదారులు దక్కించుకున్నట్లు ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి తెలిపారు. కారంపూడి ఈఓ పి.కృష్ణంరాజు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ శ్యామకూరి శ్రీనివాసరావు, దేవరంపాడు సర్పంచ్ పత్తిపాటి దీనమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత తదితరులు పాల్గొన్నారు.



వేలం పాటలు నిర్వహిస్తున్న దేవస్థానం అధికారులు

ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలి

మాచర్ల రూరల్: ప్రతి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించి, తాగునీటి సరఫరా పనులకు అంచనాలను రూపొందించాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బూడిద శ్రీనివాసరావు కోరారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా ప్రణాళిక క్యాంపెయిన్ 2వ రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. 2024–25లో ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై అధికారులు సమగ్ర నివేదికను తయారు చేయాలన్నారు. ముఖ్యంగా రోడ్లు, కాలువలు, మంచినీటి సమస్యను నివారించేందుకు అంచనాలను రూపొందించి, ఉన్నతాధికారులకు అందించాలని సూచించారు. బడ్జెట్ అంచనాల రూపకల్పనలో అధికారులందరూ సమష్టిగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజనీ దేవి, ఈఓపీ ఆర్డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బూడిద శ్రీనివాసరావు, ఎంపీడీఓ సరోజనీ దేవి, ఈఓపీఆర్డీ

సీనియర్ పెన్షనర్లకు సన్మానం

పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ పిడుగురాళ్ల శాఖ ఆధ్వర్యంలో 75 సంవత్సరాలు నిండిన సీనియర్ పెన్షర్లకు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి హాజరయ్యారు. ఆయన విశ్రాంత ఉద్యోగులు ఒక యూనియన్ ఏర్పాటు చేసుకుని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సీనియర్ పెన్షనర్స్‌ను సన్మానించి, మెమెంటోలు అందజేశారు. సంఘ అధ్యక్షుడు తుల్లిబిల్లి శేషగిరరావు అధ్యక్షత వహించారు. సంఘ సభ్యులందరూ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



జంగా కృష్ణమూర్తని సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆరోగ్యశ్రీ కార్డుల వ్యయ పరిమితి పెంచారు

ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: సీఎం వైఎస్ జగనన్న పాలనలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ చికిత్స వ్యయం పరిమితి రూ.25 లక్షల పెంచారని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య వెల్లడించారు. శనివారం మండలంలోని వేల్పూరు గ్రామంలో నూతన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీతో పాటు లబ్ధిదారులచే బయోమెట్రిక్ నమోదు కార్యక్రమం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి సకాలంలో వైద్య సేవలు అందించేలా వైద్య ఆరోగ్య సిబ్బంది నేరుగా ఇంటి ముంగిటిలోనే పరిష్కార దిశగా చర్యలు చేపట్టిందన్నారు. రోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా అవసరమైన సందర్భాల్లో కార్పొరేటు వైద్యశాలకు రిఫర్ చేసి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈకార్యక్రమంలో ఏపీయం జి.వాసుబాబు, పంచాయతీ కార్యదర్శులు కొమిటినేని అశోక్‌చౌదరి, ఆళ్ళ యుగంధర్, ఆరోగ్య కార్యకర్త అమరలింగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ నూతన కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సీతారామయ్య

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే ఓటు

నాదెండ్ల: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులకు, 80 ఏళ్లు పైబడి మంచానికే పరిమితమైన వృద్ధులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈ మేరకు మండల ప్రత్యేకాధికారి బీజే బెన్నీ, ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, బీఎల్‌వోలతో కలిసి ఎండుగుంపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే బీఎల్‌వోలు ఓటర్ల జాబితాను పరిశీలించి దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడి మంచానికే పరిమితమైన వృద్ధులను గుర్తించి మ్యాపింగ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో ఓ ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఈవీఎం సాయంతో వారి గృహానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. రాజకీయ పార్టీల నాయకులు ఎవరూ దివ్యాంగులు, వృద్ధులపై ప్రభావం ఉండకూడదన్న ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. 18 ఏళ్లు పైబడి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు.

ఘనంగా తిరంగా యాత్ర

నరసరావుపేట ఈస్ట్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో పట్టణంలో 75 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం ఘనంగా తిరంగా యాత్రను నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఏబీవీపీ గుంటూరు విభాగ్ కన్వీనర్ ప్రసాద్ మాట్లాడుతూ 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా తిరంగా యాత్రను దేశ వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా పట్టణంలో తిరంగా యాత్రను నిర్వహించడం జరిగినది. తిరంగ యాత్రలో దాదాపు 550 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తిరంగా యాత్రను పారిశ్రామికవేత్త రామిశెట్టి సుబ్బారావు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి పరిషత్ కార్యకర్తలు వరుణ్, గోపి తదితరులు పాల్గొని విజయవంతం చేశారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో యాత్ర ఆసాంతం ఉత్సాహభరితంగా జరిగింది.



భారీ జాతీయ పతాకంతో ఊరేగింపు నిర్వహిస్తున్న విద్యార్థులు

15వ ఆర్థిక సంఘం నిధులకు సమగ్ర ప్రణాళిక

ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపారాణి

అచ్చంపేట: గ్రామ పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై సమగ్ర ప్రణాళిక తయారు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపారాణి తెలిపారు. 2024–25 యాక్షన్ ప్లాన్ తయారు చేసి ఈ–గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో పొందు పరచాలని ఆమె సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ద్దేశించి ఆమె మాట్లాడారు. ఇందుకుగాను పంచాయతీ కార్యదర్శిని ఫెసిలిటేటర్‌గా నియమించాలన్నారు. అభివృద్ధి పరంగా శాఖాపరమైన గ్యాప్‌లు ఉన్నచోట అధికారులను ఫ్రంట్‌లైన్ వర్కర్స్‌గా నియమించుకోవలసి ఉంటుందన్నారు. అభివృద్ధి పనులపై ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభలు ఏర్పాటు చేసుకొని తీర్మానం చేయాలన్నారు. ముందుగా గ్రామ పంచాయతీకి సంబంధించిన పూర్తి వివరాలను ఈ–గ్రామస్వరాజ్ పోర్టల్‌లో పొందుపరచాలన్నారు. అందులో అంచనా బడ్జెట్ తయారు చేసి, ఏ స్కీంకు ఎంత ఖర్చుచేస్తారో పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. తాగునీటికి, సానిటేషన్‌కు ప్రాధాన్యత కలిపించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ స్పష్టం చేశారు. పంచాయతీ అప్లోడ్ చేసిన కార్యక్రమాలకు అనుగుణంగా 15వ ఆర్థిక సంఘ నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, పంచాయతీ విస్తరణాధికారి వీర్రాజు, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపారాణి

దేవాలయం పరిశుభ్రత

సత్తెనపల్లి: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో పట్టణంలోని రైల్వే గేటు సమీపంలోని కోదండ రామసాయి ఆలయ శుద్ధి కార్యక్రమం హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ పూజారి ఎ.ప్రేమ్‌కుమార్ శనివారం నిర్వహించారు. సభ్యు లు సురేష్, సోమశేఖర్, ఏసురత్నం, లక్ష్మణ్ పాల్గొన్నారు.